ఆ పెళ్ళి జరిగిందని వేరే చెప్పక్కర్లేదు. ఒక్కోసారి ఎన్ని ప్రయత్నాలు చేసినా జరగని పనులు వాటంతటవే జరిగిపోతాయి. 'ఘటన' అంటే ఇదేకాబోలు.

"మానవ సంబంధాన్ని, విలువల్నీ ఎత్తిచూపుతూ కథని క్లుప్తంగా వ్రాశావు. కాస్త శృంగారం కూడా ఉంటే బావుండేది!" అన్నాడు రాజు.

మొదటిరాత్రి సూర్యకాంతం సుందరం ఒడిలో తలపెట్టుకొని పడుకొని "స్రవంతి తెల్లగా, నాజూగ్గా, అందంగా వుంటుంది. విద్యాధికురాలు, ఐశ్వర్యవంతుల ఇంట్లో పుట్టిపెరిగింది. అయినా కాదని నన్ను చేసుకున్నారు. నాలో ఏంచూసి చేసుకొన్నారు?!" అని అడిగింది గోముగా.

"అందానికీ, ఆకర్షణకీ భాష్యం చెప్పలేను. అయినా అడిగావు కాబట్టి చెప్తున్నాను. కౌగలింతలో నా ఛాతీని ప్రతిఘటించాయే..." అంటూ పమిట వైపు చూశాడు. సూర్యకాంతం సిగ్గులో ముఖాన్ని చేతుల్లో దాచుకొంది.

'పుర్రెకోబుద్ధి, జిహ్వాకోరుచి' అంటే ఇదే కాబోలు!

"అసలు దీన్ని మొదట్నుంచి హాస్యధోరణితో వ్రాస్తే చాలా బావుండేది!"అన్నాడు కోటి.

తిరిగి వ్రాయడానికి ఓపిక లేదు! హాస్యాంతం మట్టుకు చెయ్యగలను.

ఓ నాలుగు నెలల తర్వాత, ఓ ప్రముఖ వారపత్రికలో సలహాల శీర్షికలో రెండు ప్రశ్నల్ని, వాటికి సమాధానాల్ని లక్షలాది పాఠకులు చదివారు. ఆ రెండు ప్రశ్నలూ ఏమిటంటే,

1. అరుంధతి–కొమరగిరి.

నేను తెల్లగా, అందంగా వుంటాను. అయినా వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి వెళ్తున్నాయి. వక్షోజాలు పెద్దవిగా అయ్యేమార్గం చెప్పండి.

2. లక్ష్మీకాంతం–వేమగిరి

మా వారు నా అవయవ సంపదని చూసి ముచ్చటపడి నన్ను వివాహం చేసుకొన్నారు. వయసుతో బాటు బిగిసడలితే, మావారు నన్ను సరిగ్గా చూసుకొంటారో లేదో అన్న భయం ఇప్పట్నుంచీ పీడిస్తోంది. అంగసౌష్ఠవం కాపాడుకొనే మార్గాలు చెప్పగలరు.

ఎవరిగోల వారిది. పీతకష్టాలు పీతవి. ●



# సారీ మిస్టర్



## కె. ఎస్. దేవి

బస్ కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాను. అరగంట అయినా రాలేదు నేను ఎక్కవలసిన బస్సు. ఛీ! ఈ వెధవ బస్సులు ఎప్పుడూ ఇంతే. టైముకిరావు మనసులోనే విసుక్కున్నాను. దరిదాపుల్లో ఆటో కూడాలేదు. నాకు చాలా టెన్షన్‌గా వుంది. అందుకు కారణం నేను ఈరోజే బ్యాంక్‌లో చేరాల్సినరోజు. ఇంతలో నా బస్ వచ్చి ఆగింది. 'మిస్' అన్న పిలుపుతో వెనక్కి తిరిగి చూశాను. స్టూడెంట్‌లా ఉన్నాడు. పైగా చేతిలో ఏదో కాగితం కూడా వుంది. ఏముంది. 'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు లేకుండా నేను బ్రతకలేను' అని డైలాగులు చెప్తాడు కాబోలు. చెప్పలేక ప్రేమలేఖ రాసుకొచ్చాడు కాబోలు. ఛీ! ఈ మగవాళ్ళంతా ఇంతే. ప్రేమ తప్ప వేరే పనేమిలేదు అని ముఖం తిప్పుకున్నాను.

ఆశ్చర్యం! నా బస్‌లో కూడా అతనే. నన్ను ఫాలో అవుతున్నాడన్నమాట. దిగవలసిన స్టేజి వచ్చేసింది. 'మిస్' అంటూ నా వెనకపడుతున్నాడు. ఇంక లాభం లేదన్నట్లు ఏమిటన్నట్లు చిరాగ్గా చూశాను. అతను నిదానంగా చెప్పకుపోతున్నాడు. మేడమ్! బ్యాగ్‌లో నుండి ఈ కాగితం పడిపోయింది. మీరు పలకకుండా వెళ్ళిపోయారు. మీరు నన్ను ఏవేవో ఊహించుకుంటున్నట్టున్నారు. అంతే! నా మైండ్ పనిచేయడం మానివేసింది ఒక క్షణం. కారణం అది నా 'అపాయింట్‌మెంట్ ఆర్డర్'. సారీ! మిస్టర్! ఐ యాం ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ అని మనస్ఫూర్తిగా అన్నాను. కాని అతను ఆ సమయానికే వెళ్ళిపోయాడు. మైగాడ్! ఎంత మిస్టేక్ జరిగింది. అందుకే ఎవర్నీ తప్పుగా అంచనా వేయకూడదంటారు ఇందుకే కాబోలు. అవును మరి ఇది స్వానుభవం.

